నేడే 'ఫైనల్' కూత...

5లో.

RNI NO :Title-Code :-TELTEL02102

జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
వార్త KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 157 శుక్రవారం 1 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

11 వేల పోస్టులతో

మెగా డీఎస్సీ

2,629 ఎస్ఏ, 6,508 ఎస్జీటీ పోస్టుల భర్తీ

గతంలో జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు

గతంలో దరఖాస్తు చేసుకున్నవాళ్లు మళ్లీ చేసుకోనక్కర్లేదని వివరణ

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త):
ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో ఈమేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏకంగా 11,062 పోస్టులతో జారీ అయిన ఈ నోటిఫికేషన్ లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,629 ఉండగా.. ఎస్జీటీ పోస్టులు 6,508 ఖాళీలు ఉన్నాయి. భాషా పండితులు 727, పీఈటీలు 182 పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్లు 220, ఎస్జీటీలు 796 పోస్టులు ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ను రేవంత్ రెడ్డి సర్కారు రద్దు చేసింది. గతేడాది సెప్టెంబర్ 6న 5,089 పోస్టులతో బీఆర్ఎస్ ప్రభుత్వం నియామక ప్రకటన విడుదల చేసింది. తాజాగా ఈ నోటిఫికేషన్ ను రద్దు చేసి, అదనంగా 5 వేల పోస్టులు కలిపి మొత్తం 11,062 పోస్టులతో రేవంత్ రెడ్డి కొత్త నోటిఫికేషన్ ను విడుదల చేశారు. అప్పట్లో దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదని సీఎం స్పష్టతనిచ్చారు. పాత దరఖాస్తులు చెల్లుబాటులో ఉంటాయని.. కొత్త డీఎస్సీకి వాటిని పరిగణనలోనికి తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తెలిపారు.

రాజీనామా చేసి రా...

తేల్చుకుందాం

రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్



- ఇద్దరం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేద్దామని సవాల్
- సేఫ్ గేమ్ వద్దు... డైరెక్ట్ ఫైట్ చేద్దామన్న కేటీఆర్
- గతంలో రేవంత్ రెడ్డి ఇలాగే సవాల్ చేసి పారిపోయారని విమర్శ
- తనది మేనేజ్‌మెంట్ కోటా అయితే రాహుల్, ప్రియాంకలది ఏ కోటా? అని ప్రశ్న

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త):
మనమిద్దరం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి... రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్గిరి లోక్ సభ స్థానంలో పోటీ చేద్దామా? సీఎం పదవికి రాజీనామా చేసి నాతో పోటీ చేయాలి' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. నీ సిట్టింగ్ స్థానం మల్కాజ్గిరిలోనే తేల్చుకుందాం రావాలన్నారు. సేఫ్ గేమ్ వద్దు... డైరెక్ట్ ఫైట్ చేద్దామని సూచించారు. గతంలో కూడా రేవంత్ రెడ్డి ఇలా సవాల్ చేసి పారిపోయారని గుర్తు చేశారు.

మిగతా 2లో.

పీఎం సూర్య ఘర్ యోజనకు

కేబినెట్ ఆమోదం

- ఎరువులపై రాయితీకి ఆమోదం
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు...
-ఐదు రకాల ఎరువులపై రూ.24,420 కోట్ల రాయితీకి ఆమోదం
- గత ధరలను కొనసాగించాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి వెల్లడి

2లో.

తెలంగాణలో ప్రభుత్వాన్ని

ఏర్పాటు చేస్తాం

: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం కొమురం బీమ్ క్లస్టర్ విజయ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిన్న బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ పాలనలో అవినీతి అక్రమాలు తప్ప ప్రజా సంక్షేమం ఎక్కడా లేదని విమర్శించారు. ఇక్కడ సాగు అవుతోన్న పసుపు ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతోందన్నారు. దేశంలో రూ.2 లక్షల కోట్లతో రోడ్లను ఎక్స్‌ప్రెస్ హైవేలుగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడితేనే వ్యాపార, వాణిజ్య రంగాలు పర్యాటకరంగ అభివృద్ధికి దోహదపడతాయన్నారు.

దేశ ముఖ చిత్రాన్ని మార్చే శక్తి బీజేపీకి మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో అనేక గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయని మండిపడ్డారు. రోడ్లు, తాగు నీరు సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో లేక అనేక గ్రామాలు ఖాళీ అయ్యాయన్నారు. రోడ్ల నిర్మాణాల కోసం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన అందుబాటులోకి తెచ్చామన్నారు. విమానాలకు ఇంధనం అందించే సామర్థ్యం మన రైతుల్లో ఉందని చెప్పారు. రైతులకు ఆర్థిక చేయూతనిచ్చి వారిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ధరణి మార్గదర్శకాల జారీ

తహసీల్దార్లు, ఆర్డీవోలు, జిల్లా స్థాయి అధికారులు, సీసీఎల్ఏలకు అధికారాల బదలాయింపు

సమీకృత భూ రికార్డుల నిర్వహణ వ్యవస్థ
ధరణి

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో ధరణి సమస్యల పరిష్కారానికి రేవంత్ ప్రభుత్వం గైడ్ లైన్స్ విడుదల చేసింది. ఈ మేరకు కలెక్టర్లకు సీసీఎల్ఏ మార్గదర్శకాలు సూచించింది.మార్చి ఒకటి నుంచి మార్చి 9 వరకు ధరణి సమస్యలను పరిష్కారించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 24వ తారీఖున ధరణిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన రివ్యూలో ధరణి అప్లికేషన్లను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించింది.అందుకు అనుగుణంగా ధరణి కమిటీ కొన్ని సూచనలు చేసింది.తహశీల్దార్, ఆర్డీవో,అడిషనల్ కలెక్టర్లు,కలెక్టర్ల సమక్షంలో కమిటీలు పని చేస్తాయి. టైం లైన్ విధించి ఆ లోపు పెండింగ్ అప్లికేషన్లను క్లియర్ చేయాలని ఆదేశించింది.కరెక్షన్ చేసిన అప్లికేషన్ల వివరాలను ఎలక్ట్రానిక్స్ రికార్డ్స్ లో భద్రపరచాలని సూచించింది.ధరణి అడ్డం పెట్టుకొని ఆక్రమించిన ప్రభుత్వ భూముల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఆధార్ నెంబర్ మిస్ మ్యాచ్,రైతుల పేర్లు తప్పుగా ఉండి ఆగిపోయిన అప్లికేషన్లు, ఫొటో మిస్ మ్యాచ్ వంటి పెండింగ్ అప్లికేషన్లను సత్వరమే పరిష్కరించాలి. అసైన్డ్ ల్యాండ్ ల సమస్యలు పరిష్కరించాలి.పాస్ బుక్ కరెక్షన్స్,పాస్ బుక్ లో మిస్ అయిన పేర్లు సర్వే నెంబర్లు, కాటా మర్జింగ్, ఒక మండల ఆఫీసులో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో కలిపి టీంలు ఏర్పాటు చేయాలి. పెండింగ్ అప్లికేషన్లను మోజుల వైస్ విభజించాలి. అభ్యర్థుల ఫోన్ నెంబర్ల ద్వారా వాట్సాప్ ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం వెంటనే చేరవేయాలి అని ఆదేశాల్లో పేర్కొంది.అప్లికేషన్లను క్లియర్ చేసే ముందు ప్రభుత్వ రికార్డులో వాటి వివరాలను తప్పనిసరిగా చెక్ చేయాలని ప్రభుత్వం సూచించింది. అన్ని అప్లికేషన్స్ మార్చి ఒకటి నుంచి తొమ్మిది లోగానే క్లియర్ చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు పరిష్కరించడం ధరణి సమస్యలపై రివ్యూ నిర్వహించి సీసీఎల్ఏకు రిపోర్ట్ సబ్మిట్ చేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

మేడారం హుండీల్లో నకిలీ నోట్ల కలకలం



పీఎం సూర్య ఘర్ యోజనకు కేబినెట్ ఆమోదం

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): కేంద్ర కేబినెట్ గురువారం నాటి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల రాయితీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐదు రకాల ఎరువులపై రూ.24,420 కోట్ల రాయితీకి ఆమోదం తెలిపింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు ఎరువుల రాయితీ అమలు చేస్తారు. గ్లోబల్ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగినప్పటికీ, గత సీజన్‌లో ఉన్న ధరలను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మంత్రివర్గ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో తెలిపారు. 2024లో నత్రజని (ఎన్)పై కిలోకు రూ.47.02, ఫాస్ఫాటిక్ (పి)పై రూ.28.72, పొటాసిక్ (కె) కిలోకు రూ.2.38, సల్ఫర్ (ఎస్)కు రూ.1.89గా సబ్సిడీ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.పీఎం సూర్య ఘర్ యోజనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.75,021 కోట్ల నిధులను కేటాయించింది. 2025 నాటికి కేంద్ర కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే కోటి గృహాలకు సోలార్ విద్యుత్ అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా ఒక్కో గృహానికి 300 యూనిట్ల విద్యుత్ అందనుంది. సెంట్రల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ ద్వారా పీఎం సూర్య ఘర్ యోజనకు సబ్సిడీని కేంద్రం అందించనుంది. 1%ఎౖఔ% అయితే రూ.30 వేలు, 2%ఎౖఔ% అయితే రూ.60 వేలు, 3%ఎౖఔ% అయితే రూ.78 వేల సబ్సిడీ వస్తుంది.

రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తారు... ప్రధాని పదవి చేపడతారు: మంత్రి పొంగులేటి

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ విజయం సాధించి రాహుల్ గాంధీ ప్రధాని పదవిని చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం కొత్తగూడెంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఒక్క ఎంపీ సీటును కూడా గెలుచుకోనివ్వమని సవాల్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ని తిరస్కరించారని, వారి వైఖరిని అసహ్యించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో గత ప్రభుత్వ దోపిడీ, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేశామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి తీరుతామని, ఇది దొరల ప్రభుత్వం కాదు.. ఇందిరమ్మ రాజ్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని ఇప్పటికే అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి హామీలో భాగంగా ఉచిత బస్సు, రూ.10 లక్షల మెడికల్ బీమా, రూ.500 గ్యాస్, రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. మూడు నెలల్లో 25 వేల ఉద్యోగాలకు, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ వేశామన్నారు. ఇచ్చిన మాట మేరకు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతామన్నారు.

పేపర్ లీకేజీలు లేని పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీ సాక్షిగా శ్వేతపత్రం ద్వారా గత ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలియజేశామన్నారు. తాము కాళేశ్వరం వెళితే కేసీఆర్ దుర్భాషలాడారని.. ఇప్పుడు అదే బీఆర్ఎస్ నేతలు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సహా అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరించిన చిన్నారెడ్డి

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నా రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ ప్రజావాణి కార్యాలయంలో ప్లానింగ్ బోర్డ్ ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను అభినందించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా పర్యవేక్షించటానికి ప్రభుత్వం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డిని నియమించింది.తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు అవకాశం కల్పించారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు. ప్రజావాణి ఇన్‌ఛార్జ్‌గా తనపై సీఎం గురుతర బాధ్యత ఉంచారన్నారు. ఇప్పటి వరకు 4.90లక్షల అర్జీలు వచ్చాయని చెప్పారు. వీటిలో నాలుగు లక్షలు సమస్యలను పరిష్కరించే దిశగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 90 రోజులు పూర్తి కాకముందే నాలుగు గ్యారంటీలను అమలు చేశామని.. లోక్‌సభ ఎన్నికల కోడ్ రాకముందే మిగిలిన హామీలనూ అమలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పనితీరుపై చిన్నారెడ్డి విమర్శలు చేశారు."తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన నిరుద్యోగ యువతను కేసీఆర్ పట్టించుకోలేదు. కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. గొర్రెలు, ఆవుల పంపిణీ కార్యక్రమాల్లో సైతం భారాస నాయకులు తమ చేతివాటం ప్రదర్శించారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటా దక్కడంలేదు. గతంలో ప్రతిపాదించి ఆచరణకు నోచుకోని ప్రాజెక్టులను మా ప్రభుత్వం పూర్తి చేస్తుంది. భారాస నేతలు ఏ ముఖం పెట్టుకుని కాళేశ్వరం సందర్శనకు వెళ్తున్నారు?గతంలో జరిగిన పనులకు సంబంధించి సుమారు రూ.40 వేల కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధ్వానంగా తయారు చేశారు. రూ.లక్ష బిల్లు చెల్లించాలంటే ఆలోచించే పరిస్థితి తలెత్తింది. ఉద్యోగ నియామకాల విషయంలోనూ భారాస ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తాం" అని చిన్నారెడ్డి తెలిపారు

ఐరాస వేదికగా పాకిస్థాన్‌కు మరోసారి స్ట్రాంగ్ కౌంటర్లు ఇచ్చిన భారత్

- **జమ్మూ కశ్మీర్, లడఖ్ భారత్‌లో అంతర్భాగాలని పునరుద్ఘాటించిన భారత్**
- **భారత అంతర్గత విషయాల్లో మాట్లాడే హక్కులేదని హెచ్చరిక**
- **సొంత దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడుల సంగతి చూసుకోవాలని హితబోధ**
- **ఐరాస మానవ హక్కుల కౌన్సిల్‌లో గట్టి కౌంటర్లు ఇచ్చిన భారత సెక్రటరీ అనుపమ సింగ్**

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): జమ్మూ కశ్మీర్ అంశంపై ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ మరోసారి తన వైఖరిని సుస్పష్టం చేసింది. ఈ విషయంలో దాయాది దేశం పాకిస్థాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూ కశ్మీర్, లడఖ్ భారత్ అంతర్భాగాలని ఐరాసలో భారత సెక్రటరీ అనుపమ సింగ్ స్పష్టం చేశారు. ఈ ప్రాంతాల సామాజిక-ఆర్థిక అభివృద్ధి, సుపరిపాలన కోసం భారత ప్రభుత్వం రాజ్యాంగపరమైన చర్యలను తీసుకుందని, భారత్ అంతర్గత విషయాలపై మాట్లాడడానికి పాకిస్థాన్‌కు ఎలాంటి అధికారమూ లేదని అనుపమ సింగ్ హెచ్చరించారు. మానవ హక్కుల రికార్డుల పరంగా అధ్వానంగా ఉన్న భారత్ గురించి మాట్లాడడం దారుణమని విమర్శించారు. స్వదేశంలో మైనారిటీల మీద జరుగుతున్న హింస సంగతి చూసుకోవాలని చురకలు అంటించారు. ఆర్థిక, సామాజిక పురోగతి విషయంలో దిక్కుమాలిన పరిస్థితులు ఎదుర్కొంటున్న పాక్.. భారత్ గురించి మాట్లాడడం దారుణమని ధ్వజమెత్తారు.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 55వ రెగ్యులర్ సెషన్‌లో అనుపమ సింగ్ బుధవారం మాట్లాడారు. జమ్మూ కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ పాకిస్థాన్, టర్కీ చేసిన ఆరోపణలకు 'సమాధానం ఇచ్చే హక్కు'లో భాగంగా ఆమె గట్టి కౌంటర్ ఇచ్చారు. భారత్ గురించి సుదీర్ఘంగా ప్రస్తావించి ఐరాస కౌన్సిల్ ఫోరమ్‌ను పాకిస్థాన్ దుర్వినియోగ పరచిందని మండిపడ్డారు. భారత్‌పై అసత్య ఆరోపణల కోసం మరోసారి ఐరాస వేదికను ఉపయోగించుకున్నారని విమర్శించారు. ఈ పరిస్థితి చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 2023లో పాకిస్థాన్‌లో మైనారిటీ క్రిస్టియన్ కమ్యూనిటీపై దారుణమైన దాడులు జరిగాయని అనుపమ ప్రస్తావించారు. 19 చర్చిలు, 89 మంది క్రైస్తవుల ఇళ్లను తగులబెట్టారని, ఐరాస భద్రతా మండలి గుర్తించిన ఉగ్రవాదులు కూడా పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్నారని ఆమె ప్రస్తావించారు. అలాంటి దేశం భారత్‌పై విమర్శలు చేయడం అనైతికమన్నారు. పాకిస్థాన్ ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆ దేశ జాతీయ బ్యాలెన్స్ షీట్లు అడుగంటాయని అనుపమ సింగ్ ప్రస్తావించారు.

రాజీనామా చేసి రా... తేల్చుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

కొడంగల్ అసెంబ్లీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సవాల్ చేసి పారిపోయారన్నారు. సవాల్ చేసి పారిపోయే రేవంత్ రెడ్డి మాటకు విలువ ఏముంటుంది? తనది మేనేజ్‌మెంట్ కోటా అయితే.. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీది ఏ కోటా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డిది పేమెంట్ కోటా.. డబ్బులిచ్చి పదవి తెచ్చుకున్నారని ఆరోపించారు. పేమెంట్ కోటా కాబట్టే రేవంత్ రెడ్డి ఢిల్లీకి పేమెంట్ చేయాలన్నారు. బిల్డర్లు, వ్యాపారులను బెదిరించి ఢిల్లీకి రేవంత్ కప్పం కట్టాలన్నారు. ఆయన విధించే సెస్‌పై త్వరలో బిల్డర్లు, వ్యాపారులు రోడ్డెక్కుతారన్నారు.

రేవంత్ రెడ్డి తన శక్తిసామర్థ్యాలను ఎక్కువగా ఊహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మగాడైతే కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రైతు బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం మేడిగడ్డ పర్యటనకు వెళుతుందని కేటీఆర్ తెలిపారు. మేడిగడ్డ తర్వాత అన్నారం బ్యారేజీ వద్ద పర్యటిస్తామన్నారు. రోజుకు 5వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నారం వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ప్రెస్ మీట్ ఉంటుందని తెలిపారు. నీటి పారుదల నిపుణులను కూడా ప్రాజెక్టు పరిశీలనకు తీసుకు వెళతామన్నారు.

మేడారం హుండీల్లో నకిలీ నోట్ల కలకలం


భారతీయ రిజర్వ్ బైంక
RESERVE BANK OF INDIA
₹100
Demand for Print the Photo of Dr. B.R. Ambedkar on Currency Notes
RESERVE BANK OF INDIA (RBI) WAS INSPIRED BY DR BR AMBEDKAR
166

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): వరంగల్ : మేడారం మహా జాతర హుండీల్లో నకిలీ నోట్లు కలకలం రేపాయి. నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన జాతరలో దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన 512 హుండీలను ఇటీవల హన్మకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపానికి తరలించారు. హుండీలకు పోలీస్ శాఖ భారీ భద్రత ఏర్పాటు చేసింది. గురువారం నుంచి హుండీల్లో కానుకల లెక్కింపు ప్రక్రియ చేపట్టగానే నకిలీ నోట్లు వెలుగు చూడడంతో అధికారులు ఖంగుతిన్నారు. ఇప్పటిదాకా చూడని నోట్లు రావడం విస్మయానికి గురిచేసింది. 300 మంది సిబ్బందిని నియమించి లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణలో ఒక్కో హుండీని తెరిచి లెక్కిస్తున్నారు. దాదాపుగా 10 రోజులకు పైగా ఈ లెక్కింపు సాగుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే, తొలిరోజు లెక్కింపు ప్రక్రియలో నకిలీ నోట్లు వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. హుండీలో ఆరు నకిలీ నోట్లను అధికారులు గుర్తించారు. అన్నీ కూడా వంద రూపాయల నోట్లు కావడం గమనార్హం. తొలి లెక్కింపులో నకిలీ నోట్లు రావడంతో మిగతా హుండీల్లో ఎలాంటివి వస్తాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది.నకిలీ నోట్లు వేసిన వ్యక్తులు తమ డిమాండ్‌తో కూడిన లేఖను కూడా హుండీలో వేశారు. నకిలీగా గుర్తించిన వంద నోటులో అంబేద్కర్ ఫొటో ముద్రించి ఉంది. మరోవైపు నకిలీ నోట్లు వేసిన వ్యక్తులు మాత్రం వంద నోటుపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని డిమాండ్ చేశారు. హుండీల్లో నకిలీ నోట్లు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నకిలీ నోట్లు కేవలం ఒక్క హుండీకే పరిమితం అయిందా లేక ఇంకా చెలామణిలో ఉన్నాయా అనే కోణంలో నిఘా పెట్టారు. ప్రధానంగా ఏజెన్సీ ఏరియాపై ఫోకస్ పెట్టారు. ఏజెన్సీ ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వీటిని చెలామణి చేస్తారేమోనని పోలీసులు భావిస్తున్నారు. కాగా, 512 హుండీల లెక్కింపు 10 నుంచి 15 రోజుల పాటు సాగుతుందని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత తెలిపారు. జాతర పూర్తయినప్పటికీ ఇంకా భక్తులు వస్తున్నందున కొన్ని హుండీలు ఏర్పాటు చేశామని తెలిపారు. సమ్మ సారలమ్మ జాతర ముగిసి, తిరుగువారం కూడా పూర్తయినందున మిగిలిన హుండీలను కూడా లెక్కిస్తామని మేడారం జాతర ఇఒ రాజేంద్రం తెలిపారు.

నిస్వార్థ సేవలకు నిదర్శనం పోలీసులు

- ఆత్మహత్యకు పాల్పడ్డ వ్యక్తిని కాపాడిన పోలీస్ అధికారి జయపాల్

కరీంనగర్, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): ప్రమాదకర పరిస్థితులు సంభవించాయని సమాచారం ఇవ్వగానే నిస్వార్థంతో సేవలందించేందుకు పనిగట్టుకుని బయలుదేరే బాధ్యులు కేవలం ఒక పోలీసులే అనడానికి ఆశ్చర్యం లేకపోయింది. గురువారం కరీంనగర్ జిల్లాలోని వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో కుర్ర సురేష్ అనే వ్యక్తి ఇంట్లో గొడవ పడి పొలం వద్దకి వెళ్ళి పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన పరిసర ప్రాంతంలోని రైతులు 100 నెంబర్ కు డయల్ చేశారు. దీంతో రైతులు ఇచ్చిన సమాచారం మేరకు బ్లూకోర్ట్ సిబ్బంది జయపాల్ సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. పురుగుల మందు సేవించి ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న ఆ బాధితున్ని 2 కిలోమీటర్ల దూరం వ్యవసాయ పొలాల గట్లపై పరుగెత్తుతూ ఆ పోలీస్ అధికారి తన భుజాలపై మోసకుంటూ వెళ్లి చికిత్స నిమిత్తం ఆ బాదితున్ని జమ్మికుంట హాస్పిటల్ లో చేర్పించారు. హుటాహుటిన ఆసుపత్రి వైద్యులు ప్రాథమిక చికిత్స ప్రారంభించి, ప్రాణాలు కాపాడారు. సంఘటన స్థలానికి వెళ్లి సరైన సమయానికి చికిత్స అందించే విధంగా ఆసుపత్రిలో చేర్పించిన పోలీస్ అధికారి శ్రమ ఫలించింది. పురుగుల మందు సేవించిన బాధితుడు ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడ్డాడని వైద్యులు పేర్కొన్నారు. పోలీస్ శాఖ అత్యవసర, ప్రాణాపాయ, ప్రమాదకర సంఘటనలు సంభవించినప్పుడు ప్రజారక్షణ కోసం పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన డయల్ 100 నంబర్ ఈరోజు ఓ నిండు ప్రాణాన్ని కాపాడింది. సమయానికి పోలీసు అధికారి జయపాల్ స్పందించి రక్షించడం వల్లే ఆ వ్యక్తి ప్రాణం పోసుకున్నాడని స్థానికులు పోలీసు అధికారిని అభినందిస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరం పొలం గట్లపై పరుగెత్తుతూ కాపాడిన ఆయన ప్రయత్నానికి స్థానికులు సూపర్ పోలీస్ అంటూ అభినందనలు తెలుపుతున్నారు.

జర్నలిస్ట్ వార్త

ఇంటి పన్నుపై పెనాల్టీలో 90 శాతం రాయితీ కల్పిస్తున్నాం

- వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ జోనా

వర్ధన్నపేట, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ పరిధిలోని ప్రజలు త్వరగా ఇంటి పనులు చెల్లించాలని గురువారం మున్సిపల్ కమిషనర్ ఇ. జోన ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. 2022- 23 సంవత్సరానికి గాను పన్నులు చెల్లి చెల్లించాల్సిన వారి పెనాల్టీలో పురపాలక సంఘం వారు 90 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ఈ సదావకాశాన్ని మున్సిపల్ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గురువారం 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సెగ్గంపల్లిలోని రామాలయం వద్ద నూతనంగా నిర్మించిన కాంపౌండ్ వాల్ ను ప్రారంభించారు. అనంతరం భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన మున్సిపల్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నేతల సహాయం

రాయపర్తి, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన గూడెల్లి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబానికి విరివిగా దాతలు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వస్తున్నారు. గురువారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజక వర్గ ఇంచార్జీ ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు గబ్బెట బాబు బాధిత కుటుంబ సభ్యులకు 50 కేజీలు బియ్యం అందజేశారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎల్లారెడ్డి ఆ కుటుంబానికి 1క్వింట బియ్యం సహాయం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఇలాంటి విషాదఛాయలు నెలకొంటాయన్నారు. అధైర్య పడకుండా, తమ చిన్నారులను చదివిస్తూ, ధైర్యంగా సహజీవనం కొనసాగించాలని ధైర్యం చెప్పారు. వారి వెంట మండల, గ్రామీణ స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గురుకుల జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాలు విడుదల

ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): గురుకుల జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాలు విడుదల అయ్యాయి. గురువారం సాయంత్రం అధికారిక వెబ్‌సైట్‌లో గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు ఫలితాలు వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందు పరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ గురుకుల జూనియర్ కాలేజీల్లో 1,924 పోస్టులు, డిగ్రీ కాలేజీల్లో 793 అధ్యాపక పోస్టులకు గతేడాది ఆగస్టులో రాతపరీక్ష నిర్వహించిన విషయం విదితమే. అందులో మెరిట్ జాబితాను ఈ నెల రెండో వారంలో బోర్డు విడుదల చేసింది. ఫిబ్రవరి 19, 20 తేదీల్లో ధృవ పత్రాల పరిశీలన చేపట్టింది. ఆ వెంటనే డెమో తరగతులు సైతం నిర్వహించింది. దీంతో అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా గురువారం తుది ఫలితాలను వెల్లడించింది.

మడికొండ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ

- రికార్డులు పరిశీలించిన వరంగల్ పోలీస్ కమిషనర్

వరంగల్, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మడికొండ పోలీస్ స్టేషన్ లో గురువారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సాయంత్రం పోలీస్ స్టేషన్ చేరుకున్న ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని కేడీలు, డిసిలు, రౌడీ షీటర్లకు సంబందిత వివరాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ లో ప్రస్తుతం పెండింగ్ ఉన్న కేసులు, నేరాలు, శాంతి భద్రతల కోసం ముందుస్తుగా తీసుకోవాల్సిన చర్యల్లో పోలీసులకు సలహాలు, సూచనలు చేశారు.

మేడిగడ్డ పర్యటనపై బీఆర్ఎస్ నేతల విస్తృత స్థాయి సమావేశం

హనుమకొండ, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): నేటి మేడిగడ్డ పర్యటనలో భాగంగా గురువారం బీఆర్ఎస్ నేతలు సమావేశమైనారు. హన్మకొండలోని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వగృహంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణా రెడ్డి, చల్ల ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేష్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, వరంగల్ నగర పురపాలక సంఘం మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు ఆదేశానుసారం కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ పర్యటనలో భాగంగా సమీక్షించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన అంబేద్కర్ సంఘం

చిట్యాల, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త) చిట్యాల మండల పరిధిలోని రాంనగర్ కాలనీకి చెందిన కుమ్మరి నర్సింహరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యం ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ పరామర్శలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, మండల అధ్యక్షులు సరిగొమ్ముల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మ్యాదరి సునీల్, మండల నాయకులు కట్కూరి శ్రీనివాస్, గురుకుంట్ల కిరణ్, గుర్రపు రాజమొగిలి, గుర్రం తిరుపతి, పాముకుంట్ల చందర్, దాసారపు నరేష్, బానోతు రాజునాయక్, మైదం మహేష్, ముత్యాల మొగిలి(ఆటో), కట్కూరి రాజు, లద్దునూరి ప్రభు తదితరులు ఉన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

రాయపర్తి, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశానుసారం గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హామ్యా నాయక్ అధ్యక్షతన బంజారా సోదరులతో సమావేశమైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకొని సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన జయంతి యొక్క విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన పాలకుర్తిలో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి బంజారా సోదరీ, సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్టీసెల్ నాయకులు శ్రీనివాస్, గూగులోత్ యాకూబ్, శ్రీనివాస్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన కొండేటి ఉపేందర్ కుటుంబానికి బాల్య మిత్రులు గురువారం 3100 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే 1991 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న ఉపేందర్ చేయడానికి ఏ పని లేక ఆటో నడిపే వృత్తినే జీవనోపాధిగా భావించుకున్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించడం భారంగా మారిన ఉపేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి జీవన ఉపాధి కోసం హైదరాబాద్ పట్టణానికి వలస వెళ్ళారు. అక్కడ తల ఒక పని చేస్తూ ఉపేందర్ దంపతులు తమ పిల్లలను చదివిస్తూ జీవిస్తున్నారు. అతని భార్య ఒక ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పని చేస్తుంది. పోయిన నెలలో ఆమె స్కూల్లో పనిచేస్తుండగా అదే స్కూల్ బస్సు రివర్స్ చేస్తూ, పనిచేస్తున్న ఆమెని గుర్తించలేకపోయారు. గ్రౌండ్ క్లీన్ చేస్తున్న ఆమెకి బస్సు తగలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ప్రమాదానికి గురైన ఉపేందర్ భార్యకు కుడికాలు విరిగిపోయి. దీంతో ప్రమాదానికి గురైన ఆమెని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్ లో వైద్యం చేయించారు. స్కూల్ లో పని చేస్తుండగా ప్రమాదం సంభవించిన కారణంగా ఆ పాఠశాల యాజమాన్యం 60 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఇప్పటికీ ఆమె కాలు మెరుగుపడకపోవడంతో ఇంకా చికిత్స అవసరం అవుతుందని ఉపేందర్ సందిగ్ధలో ఉన్నారు. కలిసి చదువుకున్న మిత్రునికి ఆర్థిక సమస్యలు తలెత్తేయని తెలుసుకున్న సహచర మిత్రులు ఆయనను సంప్రదించారు. వచ్చిన సమస్యలు పర్మినెంట్ గా ఉండేవి కావు కాస్త ధైర్యంగా ఉండాలని బాధలో ఉన్న మిత్రుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బిజెపి విజయసంకల్ప యాత్రకు బయలుదేరిన చిట్యాల బిజెపి నేతలు

భూపాలపల్లి, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చేపట్టిన బిజెపి విజయసంకల్ప యాత్రకు చిట్యాల మండల బీజేపీ నాయకులు బయలుదేరారు. గురువారం మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి సంక్షేమ పథకాలే దేశ అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. దేశంలో ఉన్న కోట్లాది ప్రజల అభివృద్దే ధ్యేయంగా ప్రధానమంత్రి పని చేస్తున్నారని అన్నారు. ఈసారి జరగబోయే ఎంపీ ఎన్నికల్లో భాగంగా కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే భారతదేశాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రధానమంత్రి తన జీవితాన్ని దారపోస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల శక్తి కేంద్ర, బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

- రాయపర్తిలో వరుస ప్రమాదాలు

రాయపర్తి, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గురువారం రాయపర్తి ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చింతనూరి అండాలమ్మ 72 సం: అనే వృద్ధురాలు తమ ఇంటి నుండి బస్ స్టాండ్ వైపు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. వారు చేపట్టిన ప్రాథమిక విచారణలో భాగంగా వరంగల్, ఖమ్మం జాతీయ రహదారి దాటుతున్న సమయంలో వరంగల్ నుండి ఖమ్మం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి అండాలమ్మ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రాయపర్తి మండల పరిధిలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఓ ప్రమాదం మర్చిపోకముందే మరో రోడ్డు ప్రమాదం సంభవిస్తుంది. ఇటీవల రాయపర్తి మండల పరిధిలో వరుసగా మూడు రోడ్డు ప్రమాదాలు ఏర్పడ్డాయి. ఒకటి లారీ ప్రమాదం, మరొకటి గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం సమీపంలో ఆటో ప్రమాదం, ప్రస్తుతం మండల కేంద్రంలో మరో ప్రమాదం చోటుచేసుకుని వృద్ధురాలు మృతి చెందిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించి, వాహనదారులు అతివేగంగా ప్రయాణించకుండా అదుపు చేయడానికి కృషి చేయాలి, ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర

- శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు



కొడకండ్ల, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): హైదరాబాదులో 2వ సారి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా వద్దిరాజు రవిచంద్రని గురువారం ఆయన నివాసంలో మండల పార్టీ అధ్యక్షులు సిందే రామోజీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు దేశగాని సతీష్ గౌడ్, రామవరం గ్రామ సీనియర్ నాయకులు ఎం నరసింహా స్వామి, జీ శ్రీనివాస్, విక్రం, ఎన్ వెంకట్రామారావు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ ఆర్థిక సహాయం

కొడకండ్ల, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని గాడిపల్లి సతీష్ అనే వ్యక్తి కొన్ని నెలల రోడ్డు ప్రమాదానికి గురైనారు. దీంతో తీవ్రంగా గాయపడిన సతీష్ చికిత్స నిమిత్తం హాస్పిటల్ లో చేరారు. కొన్ని రోజుల క్రితమే హాస్పిటల్ నుండి డిచ్చార్జి అయ్యి ఇంటికి చేరుకున్నారు. డాక్టర్స్ కొన్ని నెలల వరకు బెడ్ రెస్ట్ తీసుకోవాలని ఆయనను హెచ్చరించారు. పని కెళ్ళలేని పరిస్థితిలో ఉంటూ కుటుంబాన్ని పోషించలేక వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం తెలుసుకొన్న బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ కార్యదర్శి పసునూరి సురేష్ జరిగిన సంఘటన అధ్యక్షులు ప్రసన్న కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. ఇట్టి వారి విషయమై ఏర్పాటు చేసుకున్న గ్రూప్ లో చర్చ మొదలెట్టారు. దీంతో స్పందించిన గ్రూపు సభ్యులు మిత్రుడు కాబట్టి కొంత ఆర్థిక సాయం చేద్దామని నిర్ణయించుకున్నారు. గురువారం కార్యవర్గ మిత్రులు, బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు అందరు కలిసి బాధితుని ఇంటికి వెళ్లారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు. వారి వెంట ఉపాధ్యక్షులు షేక్ అక్బర్, నర్మేట మమతా రాణి, కార్యదర్శి చెరుకు సంధ్యారాణి, కార్యవర్గ సభ్యులు మేడుదుల అశోక్, సభ్యులు వెంకట్ రత్నం, పల్లె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బంజారుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్

- సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి అనసూయ సీతక్క

ములుగు, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): ములుగు జిల్లా కేంద్రంలో శ్రీ సంత్ సేవాలాల్ జయంతి 285వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారుల ఆరాధ్య దైవమని అన్నారు. సేవాలాల్ తన పాటలు, రచనల ద్వారా ప్రజలను జాగృతం చేయడానికి అనేక ప్రబోధాలను బోధించారని వివరించారు. ముఖ్యంగా బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా కృషి చేశారని తెలిపారు. సంత్ సేవాలాల్ ఇతర కులాలవారికి కూడా ఆదర్శమూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల మూఢవిశ్వాసమైన జంతుబలికి సేవాలాల్ తీవ్ర వ్యతిరేకి అన్నారు. జాతి జాగృతి కోసం ఎంతో హితబోధ చేశారు. తన జాతి వారిని బ్రిటిష్ వారి నుంచి, ముస్లిం వారి నుంచి కాపాడిన ఘనుడని గుర్తు చేశారు. అందువల్లే నేడు బంజారా జాతి ఆయన జయంతిని జరుపుకుంటున్నారని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వర్యులు పోరిక బలరాం నాయక్, కమిటీ సభ్యులు డిఎస్పీ రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ నూతన కమిటీలు రద్దు

- పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ

పాలకుర్తి, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): పార్టీకి తెలియకుండానే నూతన కమిటీలు వేసామని ప్రకటనలు చేయడం సరికాదని గురువారం పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఇటీవల పాలకుర్తి నియోజకవర్గం, దేవురుప్పల మండలం, చిన్న మడూర్, కొలుకొండ, పెద్దతండా, గ్రామలలో తెలియకుండా వేసిన నూతన కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. ఎవరి ఆదేశాలు లేకుండా నూతన కమిటీలు ఎన్నుకోవడంపై అధిష్టానం స్థానిక నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎవరి ఇష్టానికి వారి కమిటీలు వేయడమెంటని స్థానిక నేతలపై అధిష్టానం మండిపడుతుందన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అనుమతి లేకుండానే గ్రామాలలో నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు మరోసారి పత్రిక ప్రకటనలు ఇస్తే పార్టీ తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. నూతనంగా ఎన్నుకున్న కమిటీలను రద్దు చేస్తున్నట్లు వారు గమనించాలన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి చిత్రపటానికి కేరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రకారం ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను తక్షణమే ప్రవేశపెట్టారని తెలిపారు. మిగిలిన 4 గ్యారెంటీలలో గృహ జ్యోతి పథకం కింద ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల లోపు జీరో బిల్లు అమలు చేయడం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అమలు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఏ ప్రభుత్వమైన అధికారంలోకి రావడానికి ముందు ఎన్నికల సమయంలో ఆయా పార్టీల వారిగా నాయకులు మేనిఫెస్టో విడుదల చేసి అనేక రకాల ఆశల పల్లకి ఎక్కిస్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతారు. ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజాసేవలో పరిపాలన విధానాన్ని కొనసాగించే పద్ధతి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రమంతా సస్యశ్యామలమౌతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజల పూర్తి మద్దతు ఉందన్న సంగతి గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్వహించబోయే ఎంపీ ఎన్నికల్లో భాగంగా అన్ని సీట్లను కాంగ్రెస్ ప్రభుత్వమే కైవసం చేసుకోబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అప్సర్, బండౌతపురం మాజీ సర్పంచ్ మరుపట్ల అరుణ సాయిలు, పట్టణ కౌన్సిలర్ సమ్మెట సుధీర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, ఇతర సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, మైదం బుచ్చిమల్లు, కట్ట వెంకటయ్య, కుమార్, ప్రశాంత్, బండారి మల్లయ్య, తాటికాయల కుమార్, బత్తిని రాజు, మల్లెపాక ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సభ్యులను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యం

- ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ వి. ప్రేమ్ రాజ్

రాయపర్తి, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామాల్లో ఉన్న మహిళా సభ్యులను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యమని ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ వి. ప్రేమ్ రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో గ్రామైక్య సంఘాల సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మండలంలోని స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్న ప్రతి నిరుపేద, మధ్యతరగతి మహిళలకు వ్యాపారాల రీత్యా సహాయ సహకారాలు అందించి, అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చెప్పారు. బ్యాంక్, స్త్రీనిధి, మండల సమాఖ్య సామాజిక పెట్టుబడి నిధి (సిఐఎఫ్), వారి సొంత నిధుల ద్వార కావాల్సిన పెట్టుబడి ఋణాలను స్వయం సహాయక సంఘ సభ్యులకు సకాలంలో అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇటీవల పార్లమెంట్ నిరుపేద మహిళలను లక్షాధికారులుగా చేయడానికి సంక్షేమ పథకాన్ని ఆమోదించినట్లు తెలిపారు. ఆ పథకాన్ని మొట్ట మొదటి సారిగా భారత రాష్ట్రపతి చేతుల మీదుగా 2023 డిసెంబర్ 23న రాజస్థాన్ రాష్ట్రంలో ప్రారంభించారు. ఆ పథకం యొక్క ప్రధాన ఉద్యేశ్యం దేశంలోని స్వయం సహాయక సంఘ సభ్యులను లక్షాధికారులుగా చేయడమే అన్నారు. సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళా సభ్యులరాలు యొక్క ఆదాయం సంవత్సరానికి కనీసం లక్ష రూపాయలు ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. వివిధ రకాల వ్యాపారాలు చేయుటకు కావాల్సిన శిక్షణలు ప్రభుత్వం ద్వార ఇవ్వబడునని తెలిపారు. వారు ఉత్పత్తి చేసిన వస్తువులకు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కిరణ్ కుమార్, సిసిలు దేవేంద్ర, సమాఖ్య ఉపాధ్యక్షురాలు సుజాత, విఓఏలు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేస్తున్నాం

- ప్రజా ప్రభుత్వంపై ఎంత మంది కుట్రలు చేసిన ప్రయోజనం లేదు

- ములుగు మండల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 29(జర్నలిస్ట్ వార్త): ములుగు మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయమని మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు. స్వాతంత్ర సమయము నుంచి ఇప్పటివరకు పరిపాలించిన పాలకులు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చిన నాయకులు లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తికాకముందే ప్రజలకు ఇచ్చిన హామీలు ఒకదాని తర్వాత మరొకటి అమలు చేస్తూ పోతున్నామని చెప్పారు. అందుకు నిదర్శనం గా తెలంగాణ రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారని అన్నారు. గడిచిన 10 యేండ్ల కెసిఆర్ పాలనలో అప్పులు చేసి, లక్ష కోట్లతో కాళేశ్వరం నిర్మించి, బిఆర్ఎస్ నాయకుల జేబులు నింపుకున్న పరిస్థితి దాపురించిందన్నారు. బీజేపీ, బిఆర్ఎస్ నాయకులు కుల బలుకొని కాంగ్రెస్ పార్టీని బాధనం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు కాక ముందే 4 గ్యారంటీ లు అమలు చేసిందన్నారు. ఇచ్చిన మాటను నెరవేర్చి మరోసారి ప్రజలను ఓటు అడిగే అర్హతను సంపాదించుకున్నది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ఎవరు ఎన్ని కుట్ర ప్రయత్నాలు చేసినప్పటికీ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తూ అన్ని స్థానాలు కైవసం చేసుకోబోతున్నామని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు గట్టి నమ్మకం ఏర్పడిందన్నారు. ఇలాంటి సమయంలో ఎవరు ఎన్ని కుట్ర రాజకీయాలు చేసిన ఎలాంటి ప్రయోజనం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడే 'ఫైనల్' కూత...

ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్ కోసం పుణేరి పల్టన్‌తో హరియాణా స్టీలర్స్ 'ఢీ'
రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మూడు నెలలుగా క్రీడాభిమానులను ఉర్రూతలూగిస్తోన్న ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ ఆఖరి అంకానికి రంగం సిద్ధమైంది. గచ్చిబౌ లి ఇండోర్ స్టేడియంలో నేడు జరిగే ఫైనల్ పోరుతో పదో సీజన్‌కు తెర పడనుంది.తొలిసారి తుది సమరానికి చేరుకున్న హరియాణా స్టీలర్స్‌తో గత ఏడాది రన్నరప్ పుణేరి పల్టన్ అమీతుమీ తేల్చుకోనుంది. రాత్రి 8 గంటలకు మొదలయ్యే ఈ ఫైనల్‌కు సంబంధించి టికెట్లన్నీ అమ్ముడుపోవడం విశేషం. ఇప్పటి వరకు తొమ్మిది సీజన్‌లు జరగ్గా... పుణేరి పల్టన్ రెండోసారి... హరియాణా స్టీలర్స్ తొలిసారి ఫైనల్ చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో అంతిమ సమరంలో ఏ జట్టు గెలిచినా తొలిసారి ప్రొ కబడ్డీ లీగ్ ట్రోఫీ టైటిల్‌ను ముద్దాడుతుంది.

ఈ లీగ్ చరిత్రలో ఇప్పటి వరకు పుణేరి పల్టన్, హరియాణా స్టీలర్స్ జట్లు ముఖాముఖిగా 14 సార్లు తలపడ్డాయి. 8 సార్లు పుణేరి జట్టు... 5 సార్లు హరియాణా జట్టు గెలుపొందాయి. ఒక మ్యాచ్ 'టై'గా ముగిసింది. తాజా సీజన్‌లో నిర్ణీత 22 లీగ్ మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న పుణేరి జట్టు 17 మ్యాచ్‌ల్లో నెగ్గి, రెండింటిలో ఓడి, మూడింటిని 'టై' చేసుకొని 96 పాయింట్లతో 'టాపర్'గా నిలిచి నేరుగా సెమీఫైనల్ చేరుకుంది. మరోవైపు హరియణా 70 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. ఎలిమినేటర్-2లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించి, సెమీఫైనల్ చేరిన హరియాణా ఈ కీలక పోరులో 31-27తో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌ను బోల్తా కొట్టించి ఫైనల్లోకి అడుగు పెట్టింది. పుణేరి పల్టన్ తరఫున మోహిత్ గోయట్ ఈ సీజన్‌లో అత్యధికంగా 117 రెయిండింగ్ పాయింట్లు సాధించాడు. డిఫెన్స్ విభాగంలో మొహమ్మద్ రెజా 97 ట్యాకిల్ పాయింట్లు సంపాదించాడు. పుణేరి పల్టన్ జట్టు కెప్టెన్ అస్లమ్ ఇనామ్‌దార్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 164 పాయింట్లతో అదరగొట్టాడు. మరోవైపు హరియాణా స్టీలర్స్ రెయిడర్ వినయ్ ఏకంగా 160 పాయింట్లు కొల్లగొట్టాడు. డిఫెండర్ రాహుల్ 71 పాయింట్లు, కెప్టెన్ జైదీప్ 69 పాయింట్లతో ఆకట్టుకున్నారు.

భారత బృందానికి స్వర్ణం

: ఆసియా ఆక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత బృందం స్వర్ణం సొంతం చేసుకుంది. 4ఐ200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే విభాగంలో ఆర్యన్ నెహ్రా, అనీశ్ గౌడ, సాజన్ ప్రకాశ్, శ్రీహరిల బృందం 7 నిమిషాల 26.64 సెకన్లలో రేసు ముగించి అగ్రస్థానంలో నిలిచింది.

నిరుడు ఆసియా గేమ్స్‌లో నమోదైన భారత స్విమ్మర్ల అత్యుత్తమ టైమింగ్ (7:29.04)ను మెరుగుపరిచింది. వియత్నాం (7:29.43) జట్టుకు రజతం, థాయ్‌లాండ్ (7:40.37) బృందానికి కాంస్యం లభించాయి. మహిళల 200 మీటర్ల వ్యక్తిగత విభాగంలో పాలక్ జోషి స్వర్ణం నెగ్గింది.బెర్లిన్: జర్మన్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జోడీ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ఏకపక్షంగా సాగిన ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జంట 21-10, 21-11తో హెరిన్కోవ, జుజుకోవ (చెక్) జోడీని ఓడించింది. మహిళల సింగిల్స్, పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ల కథ ముగిసింది. ఆకర్షి కశ్యప్, సతీశ్ కుమార్ ప్రిక్వార్టర్స్‌లో ఓడిపోయారు.గుర్‌గ్రామ్: ఐటీఎఫ్ మహిళల ఓపెన్ టోర్నమెంట్లో తెలుగమ్మాయి యమలాపల్లి సహజ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 7-6 (10-8), 7-5తో భారత్‌కే చెందిన రియా భాటియాను ఓడించింది. శ్రీవల్లి రష్మిక ఇంటిముఖం పట్టింది. ఆమె 1-6, 6-3, 7-6 (5-7)తో జాక్వెలిన్ అవాడ్ (స్వీడన్) చేతిలో తలొంచింది. అంకిత రైనా క్వార్టర్స్ చేరింది. ఆమె 7-6 (6-4), 6-3తో మరో భారత అమ్మాయి జీల్ దేశాయ్‌పై విజయం సాధించింది.మొనాకో: 2027 ట్రాక్ అండ్ ఫీల్డ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు బీజింగ్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఛాంపియన్‌షిప్ నిర్వహణకు అయ్యే సుమారు రూ.7 వేల కోట్ల ఖర్చును భరించేందుకు ఇటలీ సిద్ధంగా లేకపోవడంతో చైనాకు ఆతిథ్యాన్ని ఇవ్వాలని తాజాగా ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ నిర్ణయించింది. 2015లో చివరిగా చైనాలో ప్రపంచ అథ్లెటిక్స్ జరిగాయి. 2025 ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ (నాన్‌జింగ్)కు కూడా చైనానే ఆతిథ్యం ఇవ్వనుంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్, 2022 శీతకాల ఒలింపిక్స్ తర్వాత ఆ దేశంలో జరగబోతున్న పెద్ద ఈవెంట్లు ఇవే.

తల్లి కాబోతున్న దీపికా పదుకొణే

రణవీర్ సింగ్-దీపికా పదుకొణే జంట శుభవార్త చెప్పేసింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆ గుడ్ న్యూస్ రానే వచ్చేసింది. సెప్టెంబర్ లో రణవీర్-దీపిక తమ మొదటి బిడ్డను ప్రపంచంలోకి స్వాగతం పలుకుతు న్నట్లు దీపిక ఇన్ స్టా గ్రామ్ ద్వారా వెల్లడించారు. పుట్టబోయే బిడ్డకు అవసరమయ్యే అన్నింటిని ఇన్ స్టా లో ఓ డిజైన్ రూపంలో పోస్ట్ చేసి విషయాన్ని అధికారకం చేసారు. దీంతో ఈ దంపతులకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షల వెల్లువ మొదలైంది. సెలబ్రిటీలు.. అభిమానులు..సన్నిహితులు..స్నేహితులు అంతా ఆ జోడీ విషెస్ తో ముంచెత్తుతున్నారు. వాస్తవానికి దీపిక గర్భవతి అంటూ కొన్ని రోజులుగా నెట్టింట ప్రచారం జోరుగా సాగుతూనే ఉంది. 77వ బ్రిటీష్ అకాడమీ ఫిల్మ్ అవార్డ్స్ ఈవెంట్ లో రెడ్ కార్పెట్‌పై దీపిక మెరిసిన సమయంలో ఆమె గర్భవతా? అన్న సందేహం తెరపైకి వచ్చింది. ఆమె తన బేబీ బంప్ కవర్ చేసిందంటూ బాలీవుడ్ మీడియాలో ఓ న్యూస్ చక్కర్లు కొడ్డింది. తాజాగా ఆ సందేహమే నిజమైంది. ఏకంగా బేబి పుట్టబోయే నెలనే ప్రకటించి సర్ ప్రైజ్ చేసారు. ఇదే సమయంలో దీపిక టాలీవుడ్ లోనూ 'కల్కి 2898' చిత్రంతో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆమె షూటింగ్ లో పాల్గొనడం మొదలైంది. అయితే ఆమె పై చిత్రీకరణ మొత్తం పూర్తయిందా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. 'కల్కి' మే 9న రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే అంటే సరిగ్గా రెండు నెలలు సమయం ఉంది. కానీ టీమ్ ఇంకా షూట్ లో ఉంది. ఈ నేపథ్యంలో దీపిక భాగం పూర్తి చేస్తే? ఇబ్బంది లేదు లేకపోతే గర్భవ తిగానే షూట్ లో పాల్గొనాల్సి ఉంటుంది. అలాగే బాలీవుడ్ లో 'సింగం ఎగైన్' లోనూ నటిస్తోంది. అయితే ఈ సినిమాకి సంబంధించి దీపిక పార్టు పూర్తయింది. కొత్త సినిమాలేవి సైన కూడా చేయలేదు. దీంతో కల్కి విషయంలోనే క్లారిటీ లోపిస్తుంది

దృశ్యం.. ఈసారి ప్రపంచం మొత్తం చూసేలా..

మలయాళంలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కి సూపర్ హిట్ అయిన దృశ్యం సినిమాకు క్రేజ్ ఏ రేంజ్ లో ఉందొ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీనికి సీక్వెల్ కూడా వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ దృశ్యం మూవీ ఇప్పటి వరకు ఏడు భాషలలో రీమేక్ అయ్యింది. నేపాలీలో కూడా ఈ చిత్రాన్ని రీమేక్ చేశారు. ఇదిలా ఉంటే ఆ మధ్యకాలంలో కొరియన్ భాషలో కూడా దృశ్యం మూవీ రీమేక్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొరియన్ భాషలో రీమేక్ అయిన మొదటి ఇండియన్ సినిమాగా దృశ్యం రికార్డ్ సృష్టించింది. ఇప్పుడు మరో న్యూస్ తెరపైకి వచ్చింది. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా అందరూ చూసేలా హాలీవుడ్ లో కూడా రీమేక్ చేయబోతున్నారంట. బిగ్ ప్రొడక్షన్ హౌస్ పనోరమా స్టూడియోస్ ఈ మూవీ హాలీవుడ్ రీమేక్ రైట్స్ ని సొంతం చేసుకుంది. నిర్మాణ సంస్థ తాజాగా హాలీవుడ్ లో తెరకెక్కించనున్నట్లు ప్రకటించారు. గల్ఫ్ స్ట్రీమ్ మరియు జోట్ ఫిల్మ్స్ వారితో కలిపి దృశ్యం చిత్రాన్ని హాలీవుడ్ లో రీమేక్ చేయబోతున్నారని నిర్మాత అఫీషియల్ గా ఎనౌన్స్ చేశారు. కొరియన్ భాషలో కూడా పనోరమా స్టూడియోస్ బ్యానర్ మీదనే రీమేక్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ఎవరు నటిస్తారు అనేది త్వరలో నిర్ణయించనున్నట్లు క్లారిటీ ఇచ్చారు. హాలీవుడ్ లో రీమేక్ అవుతోంది. ఇప్పటి వరకు 10 ఇండియన్ సినిమాలు హాలీవుడ్ లో అఫీషియల్ గా రీమేక్ అయ్యాయి. వాటిలో ఎస్.వి కృష్ణారెడ్డి దర్శకత్వంలో శ్రీకాంత్, రమ్యకృష్ణ జంటగా నటించిన ఆహ్వానం కూడా ఉంది. డివోర్స్ ఇన్విటేషన్ టైటిల్ తో రీమేక్ అయిన ఈ చిత్రానికి ఎస్.వి కృష్ణారెడ్డి దర్శకత్వం వహించడం విశేషం. అలాగే కమల్ హాసన్ నటించిన అభయ్ మూవీ కిల్ బిల్ గా హాలీవుడ్ లో రీమేక్ అయ్యింది. ఇప్పుడు దృశ్యంతో మలయాళీ చిత్రం హాలీవుడ్ లో రీమేక్ అవుతూ ఉండటం విశేషం. దృశ్యం ఫ్రాంచైజ్ ని జీతూ జోసెఫ్ ఇంకా కొనసాగించే ఆలోచనలో ఉన్నట్లు గతంలో ప్రకటించారు. ఇప్పటికే దృశ్యం, దృశ్యం 2 ప్రేక్షకుల ముందుకి వచ్చి సూపర్ హిట్ అయ్యాయి. దృశ్యం 3 కూడా ఉండే అవకాశం ఉంది. మరి ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు ఎనౌన్స్ చేస్తారనేది చూడాలి.

పెళ్లి వార్తలపై తాప్సీ పన్ను క్లారిటీ

తాప్సీ పన్ను పెళ్లి గురించి గత కొంతకాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తన చిరకాల ప్రియుడు మథియాస్ బోని తాప్సీ ఈ ఏడాది మార్చి చివరిలో ఉదయ్‌పూర్‌లో వివాహం చేసుకోనున్నారనే ప్రచారం బలంగా ఉంది. దీనిపై తాప్సీ ఇప్పుడు స్పందించింది. వివరాల్లోకి వెళితే...దాదాపు దశాబ్ద కాలంగా డేటింగ్ లో ఉన్న స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను ఈ ఏడాది మార్చి చివరి నాటికి తన బాయ్‌ఫ్రెండ్ మథియాస్ బోని వివాహం చేసుకోబోతోందని ప్రచారం సాగుతోంది. ఇప్పటివరకూ ఈ వార్తలపై స్పందించని తాప్సీ ఇప్పుడు క్లారిటీ ఇచ్చింది. ఇటీవల తాప్సీ తన సినిమాలు, ఇతర ప్రాజెక్ట్‌లకు సంబంధించిన అప్‌డేట్‌లను మాత్రమే సోషల్ మీడియాలో చురుగ్గా షేర్ చేస్తోంది. తన కుటుంబంతో ఉన్న ఫోటోలను కూడా తాప్సీ షేర్ చేస్తోంది. తన సోదరి స్నేహితులతో సరదా పర్యటనల ఫోటోలను షేర్ చేసింది. కానీ తన లవ్ లైఫ్ గురించి సోషల్ మీడియాలో ఎలాంటి క్లూ ఇవ్వడం లేదు. తన ప్రియుడు మథియాస్ బోతో తనకున్న సంబంధం గురించి ఏరోజూ వివరాలు వెల్లడించడం లేదు. అయినా తాప్సీ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు రావడంతో ఆమె ఎట్టకేలకు మౌనం వీడింది. జాతీయ మీడియా కథనం ప్రకారం తన ప్రియుడు, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మథియాస్ బోను వివాహం చేసుకోవడానికి తాప్సీ సిద్ధంగా ఉంది. ఉదయపూర్‌లో మార్చి చివరిలో వివాహ వేడుకలు జరుగుతాయి. రకుల్ ప్రీత్ సింగ్ - జాకీ భగ్నానీ జంట మాదిరి కాకుండా.. తాప్సీ - మథియాస్ తమ సన్నిహిత కుటుంబం స్నేహితుల సమక్షంలో మాత్రమే తమ వివాహ వేడుకను నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇది సిక్కు, క్రిస్టియన్ విధానాలలో సాగే పెళ్లి అంటూ ప్రచారం సాగింది. కానీ దీనిని తాప్సీ ఖండించింది. ప్రముఖ జాతీయ మీడియా తాప్సీని నేరుగా పెళ్లి గురించి ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ..తన వ్యక్తిగత జీవితం గురించి ఎప్పుడూ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తాప్సీ పన్ను చెప్పింది. నేను ఎప్పటికీ అలా చేయను! అని తాప్సీ చెప్పినట్లు పేర్కొంది. మథియాస్ బోతో తన ప్రేమ వ్యవహారం గురించి తాప్సీ గతంలోను పెద్దగా వివరాలు వెల్లడించలేదు. కేవలం మాథియాస్ తో కలిసి ఉన్న అందమైన ఫోటోని పోస్ట్ చేయడం ద్వారా తన డేటింగ్ ని తాప్సీ అధికారికంగా వెల్లడించింది. ఇంతకుముందు తాప్సీ పుట్టినరోజు సందర్భంగా బో తన కోసం ఒక నోట్‌ను కూడా రాశాడు. కొన్నిసార్లు నా కుంటి జోకులను చూసి నవ్వని వ్యక్తిని కనుగొన్నందుకు నేను ఎంత అదృష్టవంతుడిని... నువ్వు నవ్వుతూ ఉండేందుకు నా శాయశక్తులా ప్రయత్నిస్తాను (రెడ్ హార్ట్ ఎమోజి) అంటూ తన ప్రేమను కురిపించాడు మాథియాస్.